మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# భూ భారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

## నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 20 ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న భూ భారతి ధరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆదివారం కల్వకుర్తి తహసిల్దార్ కార్యాలయంలో కల్వకుర్తి రెవిన్యూ డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లతో భూ భారతి దరఖాస్తులపై కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనుతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా భూమి వివాదాలు తగ్గి రైతులకు, భూ యాజయానులకు శాశ్వత న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. భూ దరఖాస్తులను తిరస్కరిస్తే కారణాలను రాతపూర్వకంగా ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి రెవిన్యూ డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, ఊర్కొండ, చారకొండ మండలాల్లో 73 రెవెన్యూ గ్రామాల నుండి 3126 దరఖాస్తులు వచ్చాయని, 2040 దరఖాస్తులకు నోటీసులు అందజేయడం జరిగిందని, 1846 దరఖాస్తులను ఆమోదించడం, 1280 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని ఆర్డీఓ శ్రీను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో తహసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు.



భూ భారతి ధరఖాస్తులపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

## అధికారుల అలసత్వం.. కారోబార్

# చేతివాటం

- అందిన కాడికి దండుకో..
- రూ.8వేలకు రూ.80వేలు డ్రా..
- పంచాయతీ నిధులు కాజేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి



కోనేటిపూర్ గ్రామ పంచాయతీ


స్వీపర్ లింగమయ్య భార్య లక్ష్మమ్మ

**వంగూరు జులై 19 ప్రభాతవార్త :** గ్రామ ప్రథమ పౌరుల పదవీకాలం ముగియడంతో గ్రామాల అభివృద్ధి కుంటు పడకుండా గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనను చేపట్టింది. గ్రామ కార్యదర్శితో పాటు ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన గ్రామపంచాయతీలో పనిచేస్తున్నా 5మంది మల్టివర్కర్స్ లో కారోబార్‌గా పనిచేస్తున్న వ్యక్తి ప్రభుత్వనిధులను గుట్టుచప్పుడు కాకుండా కాజేసి తమ జేబులను నింపుకున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల ప్రత్యేకాధికారి మల్టీ వర్కర్స్ కు వేతనాన్ని అందించేందుకు చెక్కులను అందిస్తే కారోబార్ తన చతురతను వినియోగించి లింగస్వామి అనే వ్యక్తి నిరక్షరాస్యుడు కావడంతో అది ఆసరాగా తీసుకొని రూ.8వేలకు బదులుగా రూ.80 వేల మార్పిడి చేసి డ్రా చేసుకున్న సంఘటన గత 2 నెలల క్రితం చోటు చేసుకుందని మండల పరిషత్ అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే వంగూరు మండలం కోనేటిపూర్ గ్రామంలో –మిగతా3లో..

## మూడు జిల్లాలు..

# రూ.100కోట్లు



- కేంద్ర ప్రభుత్వం కరువు సాయం
- రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.50కోట్లు
- తీవ్ర వర్షాభావ జిల్లాలకు నిధులు విడుదల
- రాష్ట్రంలో 12 జిల్లాలను గుర్తించగా 3 ఉమ్మడి పాలమూరు నుంచే..
- మోడీకి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ డీకే అరుణమ్మ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త:** ఈఏడాది వర్షాలు ఆశించిన మేర కురవలేదు. ఈక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో కరు వు చాయలు అలుముకున్నాయి. దీంతో వర్షాభా వ పరిస్థితుల నుంచి కరువు నుంచి గట్టెక్కించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలమూరును కరువు ప్రాంతాలుగా గుర్తించి సాయం అందించాలని విన్నవించారు. ఈక్రమంలో కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పాలమూరులోని మూడు జిల్లాలను వర్షాభావ జిల్లాలుగా గుర్తించి రూ.100కోట్ల సాయం ప్రకటించారు. ఇందుకు అదనంగా రాష్ట్రం ప్రభుత్వం కూడా రూ.50కోట్లు ప్రకటించింది.

### మూడు జిల్లాలకు..

రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో కరువు నివారణకు కేంద్రం ప్రత్యేకనిధులు విడుదల చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని మూడుజిల్లాలకు కేంద్రం సాయం ప్రకటించింది. మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రూ. 100కోట్లు కేంద్రం విడుదల చేసింది. అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు సాయం ప్రకటించింది. ఈనిధులను కరువుసాయంగా 25వేల మంది రైతులకు అందించనున్నట్లు తెలిసింది. తెలంగాణలోని మూడుజిల్లాలకు కేంద్రం రూ. 100కోట్లు విడుదల చేసింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఈ నిధులు విడుదల చేశారు. 2021-22లో దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వే ఆధారంగా 12 రాష్ట్రాల్లో వర్షాభావ తీవ్రత అధికంగా ఉన్న జిల్లాలను కేంద్రం గుర్తించగా..తెలంగాణ నుంచి మూడుజిల్లాలను ఎంపిక చేసింది. ఈ జిల్లాల్లో కరవు నివారణచర్యల కోసం 15వ ఆర్థిక సంఘం సూచనల మేరకు జాతీయ విపత్తు నివారణ నిధి కింద కేంద్రం రూ.100 కోట్లను కేటాయించింది.

### వ్యవసాయ బలోపేతానికి చర్యలు..

కేంద్ర రాష్ట్రాల నుంచి వచ్చిన నిధులను ఆయా జిల్లాల్లో వ్యవసాయానికి ఉపయోగించనున్నారు. వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ బలోపేతం, పర్యావరణ మద్దతు, గ్రామీణ రైతు కుటుంబాల ఆదాయ భద్రత చర్యలకు వినియోగించాలని ప్రభుత్వాలు నిర్దేశించాయి. కేంద్రం కేటాయించిన రూ.100 కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా మరో రూ.50 కోట్లు కలిపి, మొత్తం రూ.150.87 కోట్ల వ్యయంతో కరవు నివారణ, అనుసరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా నిధులు విడుదల కావడంతో, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కలిపి ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేటాయించిన మొత్తం రూ.150.87 కోట్లను వివిధ విభాగాలకు విధంగా ఖర్చు చేయనున్నారు.

### కేటాయింపులు ఇలా..

మౌలిక వసతులు, శిక్షణ, సాంకేతిక, అమలు సంస్థల ఖర్చులకు రూ.10 కోట్లు వెచ్చించనున్నారు. మూడు జిల్లాల్లోని 25,000 రైతు కుటుంబాలకు నేరుగా సాయం అందిస్తామని ఇప్పటికే తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వారికి జీవనోపాధి కల్పించడంతో పాటు, నేల ఆరోగ్యాన్ని పెంచడం, భూసార పరిరక్షణ, పంట వైవిధ్యం, రక్షిత సాగు వంటి పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని వర్షాభావ నిరోధకంగా మారుస్తామని చెప్పారు. అంతేకాకుండా, పశుపోషణ, నీటి వనరుల పెంపుదల, ఆహార భద్రత, మార్కెట్ లింకేజీలు, బీమా, రుణ సాయం వంటి అంశాల్లో కూడా రైతులకు మద్దతునిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమగ్ర ప్రణాళిక ద్వారా కరవు పీడిత జిల్లాల్లో వ్యవసాయ రంగం స్థిరత్వాన్ని పొంది, రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

### సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం కరువు జిల్లాలకు అందజేసిన రూ.100కోట్ల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలోనూ కేంద్రం బాటా భాగస్వామ్యం ఉంటుంది. అమృత్ స్కీం, ఇందిరమ్మ ఇండ్లు, పీఎంశ్రీ ఇలా ఎన్నో పథకాల్లో కేంద్రం వాటా ఉన్నది. ఇప్పటికే కేంద్రం నుంచి ఐఐఐటీ, పీయూకు రూ.100కోట్లు, నవోదన పాఠశాల, అమృత్ పథకం కింద నిధులు, మహబూబ్‌నగర్, జడ్చర్లకు బైపాస్ ప్రపోజల్, కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్‌కు నిధులు, ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలు ఇలా వందల కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. ఇంకా కొన్ని అండర్‌ప్రాసెస్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు కేంద్రం నిధులు లేనిదే పనులు జరగవు. కేంద్రం నుంచి విడుదలైన నిధులను సక్రమంగా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ అభివృద్ధి

– డీకే అరుణమ్మ, ఎంపీ, మహబూబ్‌నగర్

## మహిళల ఆత్మవిశ్వాసమే

# సమాజ పురోగతికి మూలం

- మహిళల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం బలమైన పునాది
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి
- మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- అట్టహాసంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు


మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 20 ప్రభాతవార్త:** మహిళల ఆత్మవిశ్వాసమే సమాజం పురోగతికి మూలము అని, అందుకు అనుగుణంగానే మహిళాలు ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం బలమైన పునాది వేస్తుందని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబురాలు అత్యంత ఘనంగా అట్టహాసంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తీగల వెంకట స్వామి కళ్యాణ మండపంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాలకు ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలను ఇందిరా మహిళా శక్తి సంబురాలకు మహిళలు బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మహిళలందరూ కోటీశ్వరులుగా మారడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల అభ్యున్నతి, ఆత్మవిశ్వాసమే –మిగతా3లో..

## ఓల్డ్ సిటీలోని బోనాల ఉత్సవాల్లో ఎంపి డికె అరుణ



**మహబూబ్‌నగర్, జూలై20, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాత బస్తిలో వైభవంగా ఆషాడమాస బోనాలు కొనసాగాయి. ఓల్డ్ సిటీలోని అక్కన్న మాదన్న మహంకాలి అమ్మవారి బోనాల ఉత్సవాలకు ఎంపీ డీకే అరుణ హాజరయ్యారు. ఎంపీ లాల్ దర్వాజలోని సింహవాహిని అమ్మవారికి బోనం సమర్పించారు. అరుణమ్మకు ఉత్సవ నిర్వాహకులు, ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సాధార స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఓల్డ్ సిటీ బోనాల ఉత్సవాల్లో పోతారాజుల విన్యాసాలు, శివ సత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, బ్యాండు మేళాలు, ఆకట్టుకున్నాయి.

### నేడు అచ్చంపేటకు మంత్రుల రాక

- ఇందిరా మహిళా శక్తి సంబురాలు...
- కొత్త రేషన్ కార్డుల పంపిణీ అచ్చంపేట

4

## జూరాల 19గేట్లు ఎత్తివేత

### - జలాశయానికి 1,15,000 ఇన్‌ఫ్లో

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్తః జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. కర్ణాటక నుంచి భారీగా వరద ప్రవాహం నమోదు కావడంతో జూరాలకు జలకళను సంతరించుకున్నది. జలాశయానికి 1,15,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 3.682 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 29,464 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 74,081 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 600 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,07,006 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.


జూరాల గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద

# మంత్రి గారు మీరే దిక్కు

- సాగునీరు అందించాలని మంత్రికి రైతుల వేడుకోలు..
- నారు వచ్చింది నాటు వేసేందుకు నీళ్లు లేవు
- కాలువలు అస్తవ్యస్తం ముందుకు పారని సాగునీరు
- కల్వర్టుల దగ్గర పేరుకుపోయిన మట్టి
- భూములు కోల్పోయిన మాకు సాగునీరు అందించాలని డిమాండ్


కాలువలో స్తవ్యస్తంగా పెరిగిన మొక్కలను చూయిస్తున్న రైతులు

### భూమి ఇచ్చిన లాభం లేదు



డ్యామ్ కాలువ కోసం భూమి ఇస్తే మా పొలాలకు సాగునీరు వస్తాయని ఆశపడి అతి తక్కువ ధరకు రెండు ఎకరాల భూమి కాల్వ కోసం ఇచ్చాను. ఇంత కాలం మా కాల్వకు బండరాయి అడ్డు ఉందని సాగు నీరు అందించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బండరాయిని తొలగించిన సాగునీరు మా పొలంకు అందట్లేదు. ప్రస్తుతం నాటు వేసేందుకు ఐదు ఎకరాలు కరిగేట చేసిన కాల్వలో నీళ్లు లేక నాటు ఆగింది. సాగునీరు అందే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలి.

*గుంటగారి కిష్టప్ప*
*రైతు ,వడ్వాట్ గ్రామం, మాగనూర్ మండలం.*

### నీరు అందడం లేదు

రైతులు పెద్ద మొత్తంలో కాల్వకు మోటర్లు పెట్ట డంవల్లే సాగునీరు ముందుకు పారడం లేదు. రై తులు అవసరం మేరకు నీరు పెట్టుకుని ఓటర్లను ఆఫ్ చేసి సహకరించాలి. చివరి ఆయకట్టు వరకు కాలువలు పూర్తి కాలేదు. కొత్త ఏజెన్సీ వస్తే పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం.

*సురేష్ డిఈఈ ఇరిగేషన్*

**మాగనూర్, జూలై 20 ప్రభాతవార్త:** కాలువ నిర్మాణం బారెడు పొలాలకు సాగునీరు అందేది చారడే అన్నట్టు ఆయకట్టు కింద ఉన్న పొలాలకు సాగునీరు అందడం లేదు. సంఘం బండ చిట్టెం నర్సిరెడ్డి బాలెన్సింగ్ రిజర్వాయర్ రైట్ లో లెవెల్ కెనాల్ మాగనూర్ మండల పరిధిలోని నెరడగం, వర్కుర్, మాగనూర్, అచ్చంపేట, పెగడబండ, అడవి సత్యారం వరకు దాదాపు 20 కిలోమీటర్లు పొడవు ఉంది. కానీ రైతులకు సాగునీరు అందేది మాత్రం పది కిలోమీటర్ల వరకే అందుతున్నాయి. లెఫ్ట్ లో లెవెల్ కెనాల్ మక్తల్ మండలంలోని గుర్లపల్లి,దాసర్ దొడ్డి,మాగనూర్,ఓబ్లాపూర్, వడ్వాట్ వరకు 14 కిలోమీటర్లు కాలువ నిర్మాణం ఉంది. కానీ చివరి వరకు సాగునీరు అందడం లేదు. డ్యాం నిర్మాణంలో భాగంగా కల్వాలకోసం తమ పొలాలు తక్కువ ధరకు ఇచ్చినట్లు రైతులు చెబుతున్నారు. సాగునీరు అంది మా పొలాలు శశ్యామలం అవుతాయని అనుకుంటే రైతుల ఆశలు కలలుగానే మిగిలినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాగనూర్ మండలంలోని రైట్ లో లెవెల్ కెనాల్ లో నీరు వర్కూర్ శివారు దాటి కాలువ పారే పరిస్థితి లేదు. డ్యాం నుండి నీటిని ఎక్కువ ఫ్లోలో నీళ్లను కాలువకు వదిలితే కాలువ ప్రాబ్లం వల్ల వర్కూర్ దగ్గర పంట పొలాల్లోకి నీరు ప్రవహిస్తుందని, తక్కువ ఫ్లో వదిలితే నీరు ముందుకు పారడం లేదని రైతులు చెబుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న కాల్వకు మరమ్మతులు చేసి సాగునీరు ముందుకు అందించాలని అధికారులను రైతులు కోరుతున్నారు. నారు వచ్చి నాటు వేసే సమయం మించిపోతుందని, ప్రజా ప్రతినిధులు అధికారులు రైతులకు అండగా ఉండి తక్షణమే సాగునీరు అదే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సాగునీరు అందని విషయం రైతులు మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి సాగునీరు – మిగతా3లో..

## బోనాల పండుగలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, జూలై 20 ప్రభాతవార్త:** పట్నం బోనమెత్తింది. హైదరాబాద్ వ్యాప్తంగా బోనాల జాతర సందడి షురూ అయింది. అమ్మవారి ఆలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూ కట్టారు. ఆదివారం కూకట్ పల్లిలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్థానికుల ఆహ్వానం మేరకు బోనాల పండుగలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని ఘనంగా శాలువతో సత్కరిం చారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయ బోనాల పండుగ శుభ సందర్భంగా రాష్ట్రప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలోని ద్వేషం, దురాశవంటి చెడుల ను తొలగించి, అందరికీ శాంతిని శ్రేయస్సు ను ప్రసాదించమని సర్వశక్తివంతమైన మహంకాళి అమ్మ వారిని ప్రార్థిస్తున్నాను అని అన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

## మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారమివ్వాలి

**దామరగిద్ద, జూలై 20 ప్రభాతవార్త :** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని నిర్వాసితుల సంఘం జిల్లా నాయకుడు గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం దామరగిద్ద మండల పరిధిలోని కాన్‌కుర్తి గ్రామం రైతు వేదికలో నారాయణపేట్, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. భూనిర్వాసితులకు ఎకరాకు రూ. 14 లక్షలు కాకుండా ఎకరాకు 25 లక్షలు ఇవ్వాలన్నారు. మొగులప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహేష్ కుమార్, మాజీ ఎంపిటిసి బస్వరాజ్, రామకృష్ణ, ఉపసర్పంచ్ జ్ఞానేశ్వర్, జోషి, శ్రీహరి గౌడ్ , శేరి వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, గౌస్, ఆశప్ప, అశోక్ శేఖర్, పంకజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాల్

## ఓ ప్రైవేట్ పాఠశాలలో గోరింటాకు పండగ

**ధన్వాడ, జూలై 20 ప్రభాతవార్త :** ధన్వాడలోని ఓ ప్రైవేట్ పాఠశాల అయినటువంటి శ్రీ సాయి సరస్వతి విద్యా మందిర్‌లో "గోరింటాకు పండుగ" కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా యాదగిరి వరలక్ష్మి మెడిటేషన్ ట్రైనర్ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గోరింటాకు ప్రాశస్త్యాన్ని విశిష్టతను తెలియజేశారు. సనాతన ధర్మంలో విలువలను పద్ధతులను తిలక ధారణ, విభూతి ధారణ ,కాటుక ,గోరింటాకు ఇత్యాది విషయాలను నేటి మహిళలకు కావలసిన ఆచారాలు పద్ధతులను వివరంగా తెలియజేశారు. అలాగే విద్యార్థి దశ నుండి మంచి పౌరులుగా నిర్మాణం కావాలని సూచించారు. గోరింటాకు ఈ ఆషాడ మాసంలో పెట్టుకోవడం వల్ల వాతావరణంలో మార్పు రావడం ముఖ్యంగా స్త్రీలలో వేడిని తగ్గించి రోగనిరోధక శక్తిగా పనిచేస్తుందని దీనివల్ల అనేక రకాల ఔషధీ గుణాలు ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ రెడ్డి ,పాఠశాల కరస్పాండెంట్ మరాటి నారాయణ, పాఠశాల హెడ్ మాస్టర్ అన్నపూర్ణ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## ఆరోగ్యవంతమైన గిరిజన తండాల ఏర్పాటే లక్ష్యం

**టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి**

**వెల్దండ, జూలై 20 ప్రభాతవార్త:** ఆరోగ్యవంతమైన గిరిజన తండాల ఏర్పాటే లక్ష్యమని ఆ దిశగా కృషి చేస్తున్నట్లు టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని గానుగట్టుతాండ గ్రామపంచాయతీలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తన స్వంతంగా రూ.3 లక్షలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ఆదివారం మాజీ సర్పంచ్ పత్యానాయకు గోపాల్‌నాయక్ గ్రామస్తులతో కలిసి రాఘవేందర్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ వెనకబడిన గిరిజన తండాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని చాలా ప్రాంతాల్లో సరైన నీటి శుద్ధి వనరులు లేక ఫ్లోరైడ్ నీరు కలుషితమైన నీరు తాగి అనేక రోగాల పాలవుతున్నారని దృష్టిలో ఉంచుకొని శుద్ధ జలాన్ని అందించడం జరిగిందని, తండాకు అన్ని విధాలుగా తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రమేష్, లోక్య, భక్య, రాజు, పరమేష్, తరుణ్, రమేష్‌నాయక్‌తో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

## హజ్ యాత్రికులకు సన్మాన కార్యక్రమం


**పెబ్బేరు, జూలై 20 ప్రభాతవార్త :** ముస్లింలు జీవిత కాలంలో ఎంతో పవిత్రంగా అలాగే సహసోపేతంగా భావించే హజ్ యాత్రకు పెబ్బేరు నుండి బయలు దేరుతున్న జామే మసీద్ ఇమామ్ ఇబ్రహీంసాహెబ్, సోహెల్ (గౌస్)ను ఆదివారం రోజు పెబ్బేరు పట్టణ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్ ఆధ్వర్యంలో శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఎంతో పవిత్రమైన హజ్ యాత్రను ఎలాంటి అవంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసుకోవాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి, నాయకులు బురమోని రాములు యాదవ్, దయాకర్ రెడ్డి, సర్వేష్, వెంకట రమణ, మైనార్టీ నాయకులు షకీల్, బాషా, బునాదీపురం నరేందర్, 5, 8, 12వార్డ్ ఇంచార్జిలు శివ కుమార్, జాంగిర్, రంగం నర్సింహ, సత్యానారాయణ రెడ్డి, నాయకులు బలరాంనాయక్, శ్రీరాములు, గంధం ఉత్తమ్, బద్రు, ప్లంబర్ శివ తదితరులు పాల్గొన్నారు.



హజ్ యాత్రికులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## వట్టెం వెంకన్న ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**బిజినపల్లి, జూలై 20 ప్రభాతవార్త :** వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే డా.కూచు కుళ్ళ రాజేష్ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ప్రత్యేక స్వాగతం పలికారు. గోమాతకు పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే గోదాదేవి లక్ష్మి వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయఅర్చకులు వేద మంత్రాలు చారణ మధ్య ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ని సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్ రెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ అనంత నరసింహా రెడ్డి, నిత్యాన్న సత్రం కమిటీ అధ్యక్షులు వాస ఈశ్వరయ్య, శాశ్వత సభ్యులు సందడి రామచంద్రా రెడ్డి, సురేందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దెంది కృష్ణారెడ్డి, హకీమ్ మురళి, బండారు రాజశేఖర్, బాదం కృష్ణయ్య, శ్రీరామ్ రెడ్డి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.



వెంకన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

## కౌకుంట్లలో యానగుంది మౌలాలి పీర్ల ఊరేగింపు

**దేవరకద్ర, జూలై 20 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో యానగుంది మౌలాలి కౌడి పీర్ల ఊరేగింపును ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామంలో యానగుంది మౌలాలి కౌడి పీర్ల వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే సాంప్రదాయ రీతిలో ఈ ఏడాది కూడా మండల కేంద్రంలో యానగుంది మౌలాలి కౌడి పీర్ల వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో సోమవారం ఈ వేడుకలు పగలు సవారితో ముగియనున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతిరోజు పీర్ల వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పాతేహాలను భక్తులు నిర్వహిస్తున్నారు.



# ముదురుతున్న మూఢ నమ్మకాలు

- అమాయకుల జీవితాలతో చెలగాటం
- ఆపదలను ఆసరా చేసుకుని కాసుల పంట పండించుకుంటున్నారు
- ఫలితమివ్వని అధికారుల అవగాహన కార్యక్రమాలు



ప్రజలతో టోకెన్ రూపంలో డబ్బులు వసూల్



పూనకం వచ్చిందని ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తి

**నారాయణపేట జిల్లాలో మూఢనమ్మకాలు రోజు రోజుకు ముదిరిపోతున్నాయి. కొందరు అమాయక ప్రజల జీవితాలతో చెలగాటడుతున్నారు. నమ్మకం, మూఢనమ్మకం అనే మాటలు మనకు అప్పుడప్పుడు వినవస్తుంటాయి. అసలు నమ్మకం అంటే ఏంటి? మూఢనమ్మకం అంటే ఏమిటి? అనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించడం ప్రభుత్వ కార్యక్రమాలు ఎన్ని చేపట్టిన ప్రజల్లో మార్పు లేకపోవడం ఫలితం శూన్యం అని చెప్పవచ్చు మూఢనమ్మకాలు కొనసాగుటకు కారణాలు ఎన్నో..**

**నారాయణపేట ప్రతినిధి, జూలై20 ప్రభాతవార్త:**

**చదువు లేకుండుట:** సుమారు 60శాతం మందికి విద్య లేనందు వల్ల సమస్యల పట్ల అవగాహన విశ్లేషించే తీరు లేకపోవడం వల్ల నమ్మకమేదో మూఢనమ్మకమేదో తెలుసుకో లేకుండా పోతున్నారు. వారి పెద్దలు గురువులు మోసకారుల దౌర్జన్యకారుల మాటలను నమ్మి మోసపోవడం జరుగుతుంది. చదువులేమి ఉన్న ప్రాంతాల్లో అనేక మంది మూడనమ్మకాలపై ఆధారపడుతారు.

**భయం..** వైజ్ఞానిక దృక్పథం లేనందువలన జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యల పరిష్కారానికి హేతుబద్ధమైన ఆలోచన విధానం చేసే సమర్థత లేనందువలన, అజ్ఞానంతో కూడిన భయాల వలనకూడా మూఢనమ్మకాలు పెరగడానికి అవకాశం.

**అజ్ఞానం, అమాయకత్వం:** ప్రజలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. వారికి వైజ్ఞానిక అభివృద్ధి గాని వైజ్ఞానిక ఆవిష్కరణ గాని త్వరగా చేరడం లేదు. చదువు తక్కువగా ఉండటం వలన దేశములో జరుగుతున్న విషయాలను గ్రహించకున్నారు. తరతరాలుగా వస్తున్న, పెద్దలు చెప్పిన విషయాలను యధాతథంగా ఆచరిస్తున్నారు.

**మూఢనమ్మకాల వల్ల నష్టాలు...** వ్యక్తులు మూఢనమ్మకాల వల్ల ఆర్థిక నష్టాన్ని లేదా మానసిక క్షోభను ఎదుర్కొంటారు. ఉదాహరణకు, కుటుంబ సమస్యలతో నానా తాంత్రిక పూజలు చేయించడమో, లేదా భూతచేతుల భయంతో అనవసర ఖర్చులు చేయడమో జరుగుతుంది.

**సామాజిక సమస్యలు:** మూఢనమ్మకాల వల్ల సమాజంలో అసమానతలు, భేదాభిప్రాయాలు, మరియు హింస మరింత పెరుగుతాయి. తలిదండ్రులు గర్భంలో అబ్బాయి పుడతాడని నమ్మి లింగ వివక్షకు పాల్పడడం, లేదా శుద్ధి పద్ధతుల పేరుతో అణచివేతకు గురిచేయడం సామాజిక అభివృద్ధిని వెనక్కు నెట్టేస్తాయి.



**మూఢనమ్మకాల నిర్మూలన జరగాలి..**

వీటి వల్ల వ్యక్తుల వ్యక్తిగత అభివృద్ధి అడ్డంకి పడటమే కాకుండా, సమాజం మొత్తానికీ అనర్థాలు కలుగుతాయి. మనం ఆధునిక కాలంలో ఉన్నా, మూఢనమ్మకాల ప్రభావం ఇంకా చాలా మంది జీవితాల్లో కనిపిస్తుంది. అధికారులు మంత్రతంత్రాలు వంటి అనధికారిక కార్యక్రమాలను నిషేధించాలి. యంనాన్ పల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయం దగ్గర ఒక వ్యక్తి నాకు పూనకం వస్తుందని చెప్పి మరో వ్యక్తి సహకారం తో ప్రజలకు మూఢో నమ్మకాన్ని కల్పిస్తూ ప్రతి శనివారం అమావాస్య రోజు ప్రజలతో రూ. 200లు టోకెన్ తీసుకుంటూ, రాగిరేకులకు, నిమ్మకాయలకు, పచ్చి టెంకాయకు డబ్బులు తీసుకుంటూ అమాయకపు ప్రజలకు లేని పోనివి చెబుతూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ, మూఢో నమ్మకాలపై మళ్లిస్తు మోసం చేస్తున్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్ళడం జరిగింది అలాంటి వారిపై చర్య తీసుకొని పునరావృత్తం కాకుండా చూసి ప్రజలకు అవగాహన కల్పించాలి.

*గౌని శ్రీనివాస్ మాజీఎంపీటీసీ, యంనాన్ పల్లి గ్రామం, ధన్వాడ మండలం*

# రేషన్ కార్డుల పంపిణీ చారిత్రాత్మకం

### క్షీరాభిషేకం నిర్వహించిన మక్తల్ కాంగ్రెస్ నేతలు

**మక్తల్ టౌన్, జూలై 20 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాలు జరుపుకున్నందుకు గుర్తింపుగా అంబేద్కర్ కూడలి వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి శ్రీహరి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని మక్తల్ కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమ ప్రభుత్వమని, పేద ప్రజలకు గత పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వకపోగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు ఇచ్చామని, అదేవిధంగా గత పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ సైతం నియోజకవర్గంలో ఎవరికి ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు 3500 ఇందిరమ్మ ఇండ్లను నియోజకవర్గానికి ప్రభుత్వం కేటాయించిందని, ఇందిరమ్మ ఇళ్ల పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజలకు అన్ని విషయాలు తెలుసని, ప్రజలను మించిన విజ్ఞులు ఎవరూ లేరని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్టా సురేష్ గుప్తా, మార్కెట్ వైస్ చైర్మన్ , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.రవి కుమార్, సీనియర్ నేత కోళ్ల వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాస్, ఫయాజ్, గొల్లపల్లి నారాయణ, శంషుద్దీన్, ,మిస్కిన్ నాగరాజ్, కల్లూరి గోవర్ధన్, బోయ నర్సింహ, భాస్కర్, అఫ్రోజ్, దండు రాము, నరసింహ, వాకిటి కిష్టప్ప, వాకిటి నాగరాజ్ , హోటల్ నయుం, మహమ్మద్ రఫ్ , తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

# బీడీ కార్మికులకు జీవన భృతి పెన్షన్ ఇవ్వాలి

**అమరచింత, జూలై20, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో బీడీ కార్మికులకు జీవన భృతి పెన్షన్ ఇస్తామని వాగ్దానం చేసిన ఇప్పటివరకు బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వడం లేదని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జే ఎన్. దేవదానం అన్నారు. ఆదివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని మార్క్స భవనంలో టి యు సి ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు జీవన భృతి పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి బీడి కార్మికులను మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీడీ కార్మికులకు జీవన భృతి పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు పెన్షన్లు పెంచడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జూలై 31న వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న బీడీ కార్మికులు భారీగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు సామేలు, టి యు సి ఐ జిల్లా కార్యదర్శి, అరుణ్ కుమార్, టి యు సి ఐ జిల్లా సహాయ కార్యదర్శి, సి రాజు, నాయకులు వరప్రసాద్, చెన్నమ్మ, వెంకటేశ్వరమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సహకార దర్శి దేవాదానం

# బిజెపి మత విద్వేష రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**వీపనగండ్ల, జూలై20, ప్రభాతవార్త;** భారత దేశ లౌకిక రాజ్యాంగానికి వ్యతిరేకంగా బిజెపి సాగిస్తున్న మత విద్వేషరాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కే విజయరాములు అన్నారు. ఆదివారం వీపనగండ్ల మండలం బొల్లారంలో ఈనెల 23 24తేదీల్లో ఆత్మకూరులో జరగనున్న సిపిఐ జిల్లా మహాసభల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ. ఆకలి పేదరికానికి మతం లేదన్నారు. మతం ముసుగులో ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిమళ్లించే ప్రయత్నమే ఇది అన్నారు. దేశసంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ రైతులు కార్మికులపొట్టలను కొడుతున్నారు. జిల్లాలో యూరియా కొరతను తీర్చాలని కోరారు. రైతులకు ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తనాలు ఎరువులు పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయని పాలమూరు రంగారెడ్డిని జాతీయప్రాజెక్టుగా హోదా కల్పించి నిధులు ఇవ్వాలన్నారు. దశాబ్దాలు గడిచిన కల్వకుర్తి బీమా నెట్టెంపాడు కోయిల్ సాగర్ ప్రాజెక్టులు ఇంకా కొంత అసంపూర్తిగా ఉన్నాయని పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. మహిళలకు ఫ్రీబస్ పథకం తప్ప రుణమాఫీ రైతు భరోసా అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. జిల్లాలో 5328 కొత్త రేషన్ కార్డులు ఇచ్చారని వాటికి ఉచిత బియ్యం వెంటనే పంపిణీ చేయాలని, దరఖాస్తు చేసుకున్న అర్హతగల ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగునీరు తాగునీరు పరిశ్రమలు నిరుద్యోగులకు ఉపాధి కవిత అంశాలపై జిల్లా మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేయడం జరుగుతుందని జిల్లా నలుమూలల నుంచి నేతలు కార్యకర్తలు ప్రజలు శ్రేయోభిలాషులు అభిమానులు పాల్గొని జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గోపాల్, బొల్లారం సిపిఐ శాఖ కార్యదర్శి చలమారెడ్డి, శివ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

# శక్తి పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం

**ఊట్కూర్, జూలై 20 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండలకేంద్రంలో శక్తి ఫౌండేషన్ 5వ వార్షికోత్సము సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైందని, దాదాపుగా 30మందికి పైగా గ్రామయువతి, యువకులు ఈమెగా రక్తదానశిబిరంలో పాల్గొన్నారని, వారికి శక్తిఫౌండేషన్ అధ్యక్షులు చింతన్ పల్లి శివప్రసాద్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాశ్‌రెడ్డి, జనార్ధన్, బాల్‌రెడ్డి, మోట్కర్ మోహన్ రెడ్డి ,హజమ్మ, వివాదూర్ రెహమాన్, రఫీ, హుస్నాబాద్ పాషా, వఖరి న్యూస్ ఇస్మాయిల్ గద్వాల్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, సందాపురం నరేష్ ,గోపాల్, డా.భరత్, డా.ప్రీతిరెడ్డి, సిఎస్‌సి హెల్త్‌కేర్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

## విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

**ఊట్కూర్, జులై 20 ప్రభాతవార్త :** కరెంట్ షాక్‌కి గురై చికిత్స పొందుతూ ఓ పెయింటర్ మృతిచెందిన ఘటన ఊట్కూర్ మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారంగా అమిన్‌పూర్ గ్రామానికి చెందిన కురువ మల్లేశ్ పగిడిమర్రిలో శనివారం ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. తీవ్రగాయాలు అయిన ఆయనను నారాయణపేట జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి మహబూబ్ నగర్‌కి ,అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స తీసుకుంటూ ఇవాళ మరణించాడు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

**ఊట్కూర్, జులై 20 ప్రభాతవార్త :** ఉట్కూరు మండలం నిడుగుర్తి గ్రామంలో విద్యుత్ షాక్ వల్ల ఆవు మృతి రాత్రి కురిసిన వర్షానికి ఆవు మేపులకు పోయిన బాపురం పోయే దారిలో వి అనంతరెడ్డి పొలం ట్రాన్స్ ఫార్మర్ దగ్గర ఎర్త్ వైరుకు గ్రాసం వేస్తున్న సందర్భంలో ఆవుకు విద్యుత్ షాక్ తగడం వల్ల అక్కడికక్కడే మరణించడం జరిగింది. వెంటనే పక్కనున్న పొలం వారు చూసి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగింది. ఈ విషయము ఉట్కూరు మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, జిల్లా సహా కార్యదర్శి మహిపాల్ రెడ్డి, పగడి మారి గ్రామ అధ్యక్షుడు నాగార్జునకు తెల్పడం వల్ల ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇచ్చి తప్పకుండా మీ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఆర్థికంగా సాయం చేయడానికి ప్రయత్నిస్తామని తెలపడం జరిగింది.



## శ్రీశ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో హరితహారం

**దేవరకద్ర, జూలై 20 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి శివాలయం ఆవరణలో ఆదివారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం పరిసరాలలో, వీరప్పయ్య దేవస్థానం అర్చకులు నాగరాజు స్వామి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగరాజు స్వామి మాట్లాడుతూ మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం పాటుపడాలని సూచించారు.



## సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేద్దాం

**వెల్దండ, జూలై 20 ప్రభాతవార్త:** పెన్షన్ల పెంపుకై రంగారెడ్డి జిల్లా ఆమనగలు పట్టణ కేంద్రంలో నిర్వహించే సన్నాహక సమా వేశాన్ని విజయవంతం చేద్దామని విహెచ్‌పిఎస్ నాయకులు భరత్ మహారాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నేడు ఆమనగల్లులోని శ్రీ లక్ష్మి నరసింహ ఫంక్షన్‌హాలులో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే సన్నాహక సమావేశానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని పెద్ద ఎత్తున వికలాంగులు వృద్ధులు వితంతువులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంట చేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలి

**మద్దూర్, జులై 20 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంట చేయుటకు ఒక కుక్, అసిస్టెంట్ కుక్కు పోస్టులు ఖాళీగా ఉన్నాయని మండల విద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు స్థానికంగా ఉన్న పాఠశాలలో టీచర్లను సంప్రదించాలని, దరఖాస్తులు చేసుకునేవారు పదవ తరగతి పాసై ఉండాలి. అదేవిధంగా మద్దూరు స్థానికులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వబడునని అని తెలిపారు. వివరాలకు పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించాలని విద్యాధికారి తెలిపారు.

# రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

**- రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలి - ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై20, ప్రభాతవార్త:** పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్‌లోని రాజా బహదూర్ రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తూము ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలో ప్రకటించిన విధంగా పేద రెడ్ల అభ్యున్నతి కొరకు రెడ్డి కార్పొరేషన్ కు చట్టబద్ధత కల్పించి, కార్యవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని అలాగే రెండు వేల కోట్ల రూపాయలలతో నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అన్ని విద్య ఉద్యోగ నియామకాల్లో ఈడబ్ల్యూఎస్ పథకాన్ని సంపూర్ణంగా అమలుపరచాలని కోరారు. తమ సంస్థ ద్వారా చదువులో ముందంజలో ఉన్న పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని అలాగే వివిధ ప్రమాదాల్లో గాయపడిన పేద రెడ్లకు వైద్య సహాయం కొరకు ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నరసింహారెడ్డి,సహాధ్యక్షులు పసుల ధనంజయ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి ఎన్. సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి,నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దొడ్ల నారాయణరెడ్డి, నారాయణపేట అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రాంరెడ్డి , వెంకట రెడ్డి, కొడంగల్ నియోజకవర్గం అధ్యక్షులు దశరథ రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ కార్యదర్శి అరవింద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, తిరుపతిరెడ్డి,వనపర్తి మేగారెడ్డి , జయపాల్ రెడ్డి,మల్లారెడ్డి ,శ్రీధర్ రెడ్డి, పట్టణ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు మల్లు సరస్వతి స్వరూప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తూము ఇంద్రాసేనా రెడ్డి

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఎమ్మెల్యే

**బిజినేపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** పర్యావరణపరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలని,ప్రతి ఒక్కరూ విధిగా రెండు మొక్కలు నాటాలని, తల్లిలా వాటిని కాపాడడం వల్ల రాష్ట్రం పచ్చదనం సంతరించుకుంటుందని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. వట్టెం వెంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో వన మహోత్సవంలో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని మొక్కలను నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో తల్లులు మొక్కలు నాటితే తమ పిల్లలను చూసుకున్నట్లే జాగ్రత్తగా చూసుకుంటారని చెప్పారు. పిల్లలు కూడా తమ తల్లుల పేరుమీద మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఒక విద్యార్థి ఒక మొక్క నాటి దాని సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి, వెంకన్న స్వామి ఆలయ వ్యవస్థాపక దర్శకర్తలు సందడి ప్రతాప్ రెడ్డి,రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నర్సింహ రెడ్డి, సందడి రామచంద్రా రెడ్డి, సందడి సురేందర్ రెడ్డి, సందడి దేవేందర్ రెడ్డి, నిత్య అన్నదానసత్రం అధ్యక్షుడు వాసఈశ్వరయ్య,హకీం మురళి, బాస్కరాచారి, రాగి మధుసూదన్ రెడ్డి, భగవంత్ గౌడ్, నీలం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, నవోదయ విద్యార్థులు పాల్గొన్నారు.


వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

# తాగునీటి కోసం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కృషి

**హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**

**రాజాపూర్, జూలై 20 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలపరిధిలోని మల్లేపల్లి గ్రామంలో గ్రామ ప్రజల దాహార్తిని తీర్చుట కొరకు ఆదివారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సొంత నిధులతో మంచినీటి బోరు వేయించడం జరిగింది. గ్రామంలో వేసిన బోరులో పుష్కలంగా నీరు రావడంతో పలువురు మల్లేపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాతృమూర్తి శశికళరెడ్డి ఉమ్మడి బాలానగర్ ఎఎంసి వైస్‌చైర్మన్ శేఖర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు విస్లావత్ శ్రీనివాస్‌నాయక్,కిసాన్ సేనఅధ్యక్షులు రమేష్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్లు పంచాక్షరి, రమణ, నాయకులు గణేష్ నాయక్ , శివకుమార్, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ నాయక్, శివకుమార్, నరహరి, విక్రమ్ రెడ్డి, మంజ్య నాయక్, కె.అశోక్ జి, జంగయ్య రాజేష్, భాస్కర్, శ్రీను, నారాయణ నాయక్, రాఘవేం దర్ నాయక్, శివకుమార్ నాయక్, సంజు నాయక్, శ్రీను, ప్రవీణ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


బోరు వేయించిన అనిరుధ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

# అతివేగంతో లారీని ఢీకొన్న కారు

**ఒకరు మృతి ఒకరికి గాయాలు**

**పెబ్బేరు, జూలై 20 ప్రభాతవార్త :** పెబ్బేరు మండల పరిధిలో నేషనల్ హైవే రంగాపురం గ్రామం దగ్గర శనివారం రాత్రి 10:30కు షాద్‌నగర్ నుంచి కర్నూలు వెళుతున్న కారు అతివేగంతో లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన చిన్న ఎమ్మెస్, అతని భార్య పద్మకు కాలు విరిగి తీవ్రగాయాలు అవడంతో వెంటనే అంబులెన్స్‌లో కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారని వివరాల్లోకి వెళితే షాద్‌నగర్ వాసి చిన్న ఎమ్మెస్ ఎన్ ఫార్మ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడు, అతని భార్య పద్మప్రియ కారులో కర్నూల్ కు వెళుతున్న తరుణంలో అతివేగంగా లారీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. అప్పటికే ట్రాఫిక్ జామ్ అయిన విషయం తెలుసుకున్న పెబ్బేరు ఎస్సై యుగంధర్ రెడ్డి హుటాహుటిన తన సిబ్బందితో అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కాకుండా చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై యుగంధర్ రెడ్డి తెలియజేశారు.



# జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

**సిపిఐ మండల కార్యదర్శి, అబ్రహం**

**అమరచింత, జూలై 20, ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వనపర్తి జిల్లా మహాసభలు ఈనెల 23న ఆత్మకూరు పట్టణంలోని ఎం జి గార్డెన్లో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు వనపర్తి జిల్లాలో ఉన్న సిపిఐ శ్రేణులు భారీగా పాల్గొనాలని సిపిఐ అమరచింత మండల కార్యదర్శి, అబ్రహం కోరారు. ఆదివారం అమరశింత మండల కేంద్రంలోని సిపిఐ జిల్లా మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై మహాసభలో చర్చించి సిపిఐ పార్టీ కార్యచరణ రూపొందిస్తుందని తెలిపారు. అలాగే సిపిఐ వనపర్తి జిల్లా మహాసభలకు ముఖ్య వక్తగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే, కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు భాస్కర్, రవీందర్, శ్యాంసుందర్, ఇజ్రాయిల్, వినోద్, తదితరులు ఉన్నారు.


అమరచింతలో సిపిఐ వనపర్తి జిల్లా మహాసభల కరపత్రాన్ని విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

# భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

**నారాయణపేట ప్రతినిధి,జూలై 20 ప్రభాతవార్త :** నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి జిల్లా అధ్య క్షులు మశ్చేంధర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం డిమాండ్ చేశారు. 6 వ రోజు రిలే దీక్షలలో భాపుర్ ,గ్రామస్తులు కూర్చున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం 14 లక్షల రూపాయలు ఎకరాకు ఇస్తానడం సమంజసం కాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఎకరా 30 లక్షల పైబడి ధర ఉందని అన్నారు. భూమికి బదులు భూమి చూయించా లని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బలవంతంగా భూములు తీసుకోవడం ఆపాలి. రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి వారిని సంతృప్తి పరిచిన తరువాత భూములు సేకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్ట్ సైజ్ తగ్గించి లిఫ్ట్ ద్వారా కొడంగల్ ప్రాంతానికి నీళ్ల తీసుకెళ్ళాలని అన్నారు. నేటి దీక్షలను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ భూనిర్వాసితుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధర్మ రాజు, రైతుసంఘం జిల్లా నాయకులు మహేష్ కుమార్‌గౌడ్ విరమింపజేసారు. ఈ కార్యక్రమములో భూ నిర్వాసితుల సంఘం నాయకులు కేశవులు, పేరపల్ల ఆంజనేయులు, సింగారం హన్మంతు, లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

# మంత్రి గారు మీరే దిక్కు


కాలువలులో పెరిగిన పిచ్చి మొక్కలు

(మొదటి పేజీ తరువాయి)

అందించేందుకు కృషి చేస్తానని రైతులకు మాటిచ్చారు.

**నారు వచ్చింది నాటుకు నీళ్ల లేవు....**

జూన్‌నెలలో మిరుగు తర్వాత రైతులు వ్యవసాయ పనులు మొదలు పెడతారు.నాటు వేసే సమయానికి ఒక నెల ముందుగానే నారుమడి పోసుకుంటారు. జూన్‌లో పోసిన జూలై నెలలో నాటు వేయాల్సి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కానీ నాటు వేసేందుకు కాలువలో సాగునీరు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నిండుగా నీరు ఉన్న మా పోలాలకు నీరు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.

**కల్వర్ట్ల దగ్గర పూడిక తీయండి...**

రిజర్వాయర్ నుండి సాగునీరు కాలువలలో పూర్తిస్థాయిలో వచ్చిన మధ్యలో కల్వర్ట్ల దగ్గర పూడిక పేరుకుపోవడంతో నీరు చివరి వరకు అందడం లేదు.పెగడబండ గ్రామం దగ్గర అరకొరపనులతో కాంట్రాక్టర్ మధ్యలోనే అసంపూర్తిగా వదిలేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకుంటలేరు.రైతులకు సాగునీరు అందించాలని చిత్త శుద్ధి అధికారులకు ఉంటే కల్వర్ట్ల దగ్గర పూడికను తక్షణమే తీయించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

**మా భూములు సస్యశ్యామలం అవుతాయి అనుకుంటే?**

సంఘంబండ రిజర్వాయర్‌కు మా పొలాల్లో భూములు కేటాయిస్తే మా భూములకు సాగునీరు అంది సస్యశ్యామలం అవుతాయి అనుకుంటే మాఆశలన్నీ కలలుగానే మిగిలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల భూములలో తవ్విన ప్రతి కాలువకు సాగునీరు అందిస్తే ప్రభుత్వానికి రుణపడి ఉంటామని రైతులు కోరుతున్నారు.

**డ్యాంకు పునాదులు వేసింది ప్రజా ప్రభుత్వమే!..**

సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను 2005 సంవత్సరంలో రైతులను రాజులను చేసే లక్ష్యంతో వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వమే డ్యాంకు పునాదులు వేసి నిర్మించింది. కానీ ప్రస్తుతం కాలువలు అస్తవ్యస్తంగా ఉండడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. 10 సంవత్సరాలు పాలించిన గత ప్రభుత్వం కాలువలను నిర్వీర్యం చేసిందని, సిమెంట్ బెడ్స్ వేయకపోవడంతో కాలువలో సిల్టు ఏపుగా పెరిగి నీరు పారడం లేదని రైతులు అంటున్నారు. కల్వర్టుల దగ్గర పూడిక తీయకపోవడంతో నీరు ముందుకు పారడం లేదని విమర్శలు సైతం ఉన్నాయి. రైతుల క్షేమం కోరే కాంగ్రెస్ ప్రభుత్వమే కాలువలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్ట వరకు సాగునీరు అందించాలని రైతుల కోరుతున్నారు.

# అధికారుల అలసత్వం.. కారోబార్ చేతివాటం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామపంచాయతీ నిధులు వృధా కాకుండా పంచాయతీ అభివృద్ధి కోసం గ్రామపంచాయితీ కార్యదర్శి, ప్రత్యేక అధికారిని నియమించి చెక్కు పవర్ ఇచ్చింది. చెక్కులపై సంతకాలు పెట్టడానికి మాత్రమే ప్రత్యేక అధికారి కొనసాగుతూ గ్రామ పంచాయతీలో పనులు జరిగిన జరగకపోయినా గ్రామ కార్యదర్శి మిగతా సిబ్బంది ఏమి చేసినా కూడా పట్టించుకోకుండా ప్రత్యేక అధికారి నామమాత్రంగానే కొనసాగుతున్నారు. ఇలా చేయడంతో పంచాయతీ కార్యదర్శి, కారోబారులు తమ ఇష్టానుసారంగా నిధులను డ్రా చేసి ప్రభుత్వ నిధులను కాజేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. విషయం తెలిసి పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్యను గ్రామానికి రావాలని అధికారులు, గ్రామ ప్రజలు పిలిచిన రాకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కార్యదర్శి గ్రామానికి రాకపోవడంతో ఈ తతంగమంతా కార్యదర్శి కనుసన్నల్లోనే నడిచిందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించేందుకు మంజూరు చేసిన ట్రాక్టర్ మరమ్మతులకు నోచుకోవడంతో ఆ ట్రాక్టర్‌ను మరమ్మత్తు చేయించాలని గ్రామ ప్రజలు పలుమార్లు కార్యదర్శికి విన్నవించిన, కార్యదర్శి మాత్రం గ్రామ పంచాయతీలో నిధులు లేవని తోసిపిచ్చారని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో ఉన్న నిధులు సిబ్బందికి జీతాలు ఇవ్వకుండా గ్రామ కార్యదర్శి, కారోబార్ ఇద్దరు కలిసి నిధులు గోల్‌మాల్ చేసి జేబులు నింపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారి సంతకము పెట్టినటువంటి చెక్కుపై రూ.8 వేల చెక్కను, రూ.80 వేలకు మార్చి ఏల డ్రా చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఈ సంఘటనపై అధికారుల స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి. గ్రామపంచాయితీ రికార్డులు అన్ని శాఖలకు సంబంధించిన బ్యాంకు అకౌంట్స్ మొత్తం గ్రామసభలో వెరిఫికేషన్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళన చేపడుతామని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**కార్యదర్శి వివరణ ఇవ్వడం లేదు :ఎంపీఓ రమేష్**

కోనేటిపూర్ గ్రామంలో జరిగిన సంఘటనపై సంబంధిత పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా కార్యాలయానికి వచ్చి కలిసి చెబుతానని చెప్పి కార్యాలయానికి కూడా రావడం లేదని ఎంపీఓ రమేష్ ప్రభాతవార్తతో వివరించారు. సదరు వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని చెప్పిన కార్యదర్శి ఎలాంటి కార్యాచరణ చేపట్టడం లేదని ఆయన వివరించారు.

**నమ్మించి డ్రా చేశారు...**

పంచాయతీ సిబ్బంది లక్ష్మమ్మ మా పేరుపై వచ్చిన రూ.8వేల రూపాయల చెక్కును డ్రా చేసి డబ్బులు ఇస్తామని మమ్మల్ని నమ్మించి కారోబార్ రూ.80 వేలుగా మార్చి డ్రా చేసుకొని మమ్మల్ని మోసం చేసి మాకు మాత్రం రూ.8వేలే ఇచ్చారని, పంచాయతీ నిధులకు మాకు ఎలాంటి సంబంధం లేదని స్వీపర్ లింగమయ్య భార్య లక్ష్మమ్మ వాపోతోంది.

## మహిళల ఆత్మవిశ్వాసమే

# సమాజ పురోగతికి మూలం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రానికి బలమైన పునాదిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని తెలిపారు. మహిళలకు నేడు అన్ని రంగాల్లోనూ ప్రోత్సాహాన్ని, అవకాశాలను కల్పిస్తుందని ప్రభుత్వం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా సంక్షేమ పథకాల వివరాలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. స్వయం ఉపాధికి తగిన ప్రోత్సాహం, స్వయం సహాయక సంఘాల పెంపుదల, విద్య, ఆరోగ్యం వంటి అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ 1992 సంవత్సరంలో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం డ్వాక్రా పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగు పథకంగా నామకరణం చేసి దాన్ని కొనసాగించాలని, 2004 నుండి 2014 వరకు ఐకేపీగా నామకరణం చేసి మహిళల అభ్యున్నతికి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి కృషి చేశారని ఎమ్మెల్యే వంశీకృష్ణ కొనియాడారు. 2014 నుండి 2023 వరకు గత ప్రభుత్వం హయాంలో మహిళల సంక్షేమం పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన చెప్పారు.


ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఇప్పుడు ఇందిరమ్మ ప్రభుత్వం నల్లమల్ల ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అందులో భాగంగానే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 500 రూపాయలకు వంట గ్యాస్, గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును, మహిళల పేర్లు పైన ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని చెప్పారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని 254 స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 14.22 కోట్ల రూపాయల చెక్కును, 2568 మంది స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు 3.03 కోట్ల రూపాయల చెక్కును, ఐదుగురు సభ్యులకు 50 లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును, 28 మంది సభ్యుల 17.40 లక్షల రూపాయల లోన్ బీమా చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అదనపు కలెక్టర్ అమరేందర్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేష్ స్వయం సహాయక సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు అత్యంత సంఖ్యలో పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతులకు

# న్యాయమైన పరిహారం అందించాలి

**నారాయణపేట, జూలై 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాపై వివక్ష చూపిస్తున్నారని బిజెపి సీనియర్ నాయకులు నాగురావు నమాజీ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్‌తో కలిసి నాగురావు నామాజీ మాట్లాడారు. నారాయణపేటలో కొనసాగుతున్న అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను పాలెం తరలించారాని, జిల్లా కేంద్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గంలో తప్పించి నారాయణపేట, మక్తల్ నియోజకవర్గల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా మరాయన్నారు. ఇదిలా ఉంటే జిల్లా కేంద్రంలోని ప్రజలు ఏం పాపం చేశారో కానీ వారికి వైద్యసేవలను సైతం దూరం చేశారన్నారు. రెండు నెలలుగా పట్టణ ప్రజలు ప్రభుత్వ అస్పత్రి వైద్యసేవలు కరువయ్యాయ్యన్నారు. దీంతో పట్టణ ప్రజలకు ప్రయివేట్ అస్పత్రులే దిక్కాయ్యాయన్నారు. నిరుపేద ప్రజలు వైద్యసేవలు అందుక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు స్పందించక పోతే తీవ్ర పరిణామాలను ఎదుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.అదేవిధంగా నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టం పరిహారం ఇవ్వాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఎందుకు నిలిచిపోయాయో ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇరవై నెలలుగా జిల్లాకు అభివృద్ధి చేసింది ఏమిలేదాన్నారు. అందుకే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ది చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి జిల్లాలో అధ్యక్షులు సత్యయాదవ్ మాట్లాడుతూ రాబోయో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జిల్లాలో అత్యధిక స్థానాలను గెపించుకోవాలనే ఉద్దేశ్యంతో సోమవారం జిల్లాలో కేంద్రంలోని శ్యాసన్ పల్లి రోడ్డులోని లక్ష్మిబంకెట్ హాల్లో బిజెపి కార్యకర్తల జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఈ సమావేశానికి జిల్లా ఇంచార్జీలు సంకినేని వెంకటేశ్వర్ రావు, బండ కార్తీక హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ నెల 26న నూతనంగా ఎన్నికైన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, ఎంపి డికె అరుణమ్మ నారాయణపేట జిల్లా కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలను బిజెపి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు రతంగ్ పాండు రెడ్డి, పగుడాకుల శ్రీనివాస్, బిజెపి పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగూరావు నామాజీ

## అచ్చంపేటలో నేడు రేషన్ కార్డులు పంపిణీ

**లింగాల, జూలై 20 ప్రభాతవార్త:** అచ్చంపేటలో సోమవారం (నేడు) రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు ఆదివారం తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. లింగాల మండలంలో కొత్త రేషన్ కార్డులు 173, పాత రేషన్ కార్డులోనే పేర్లను యాడ్ చేసినవి 1138 రేషన్ కార్డులను అచ్చంపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. కొత్తగా రేషన్ కార్డు వచ్చిన వారు,యాడ్ చేసుకున్న వారు తమ రేషన్ కార్డులను తీసుకోవాలని కోరారు.

## శివాజీ యూత్ నూతన కమిటి ఎన్నిక


శివాజీ యూత్ నూతన కమిటి సభ్యులు

**బిజినేపల్లి, జూలై 20 ప్రభాతవార్త :** బిజినేపల్లి గ్రామ ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ నూతన కమిటిని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు గంగనమోని హరీష్ ఆదివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా రాము, అభిషేక్ చారి, రాజు, నరేందర్, పరమేష్, ప్రధాన కార్యదర్శిగా చీర్డం తిరుపతయ్య, కోశాదికారి, కార్యదర్శులు,సలహాదారులు,సోషల్ మీడియా ఇంఛార్జీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. శివాజీ మహరాజ్ ఆశయాలను ప్రేరణగా తీసుకొని గ్రామంలో రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి యువశక్తిని సమాజ హితం దిశగా పాటుపడుతామని అన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

**ఉట్కూరు, జూలై 20 ప్రభాతవార్త :** నారాయణ పేట మండలం పరిధిలోని సింగారం గేటు దగ్గర ఉన్న బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం దగ్గర బిఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహిస్తున్నట్లు బిఆర్ ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, టౌన్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, చిట్టెం సూచిరిత రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండల మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, రైతు బంధు అధ్యక్షులు,ఎంపిటిసిలు మాజీ సర్పంచులు,గ్రామాల ముఖ్య నాయకులు,అధ్యక్షులు,కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు .

## జావలింగ్ త్రోలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఆవుసలికుంట విద్యార్థి



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఆవుసలికుంట వంగూరు సాయికుమార్

**లింగాల, జూలై 20 ప్రభాతవార్త:** మండలంలోని ఆవుసలికుంట గ్రామానికి చెందిన వంగూరు సాయికుమార్ అనే విద్యార్థి ఆదివారంకల్వకుర్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 20 అథ్లెటిక్స్ జావలింగ్ త్రోలో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి కైవసం చేసుకొని రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యాడు. రాష్ట్రస్దాయికి ఎంపికైన వంగూరు సాయికుమార్ ప్రస్తుతం సికింద్రాబాద్ అల్వాల్‌లోని ప్రభుత్వ ఐటిఐ డీగ్రీ కళాశాలలో ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. జావలింగ్ త్రోలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థి తల్లిదండ్రులు వంగూరు లక్ష్మిదేవమ్మ, బాలస్వామి, రాష్ట్ర సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## నేడు అచ్చంపేటకు మంత్రుల రాక

**- ఇందిరా మహిళా శక్తి సంబురాలు,- కొత్త రేషన్ కార్డుల పంపిణీ అచ్చంపేట**



ఇందిరా మహిళా శక్తి సంబురాలకు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**అచ్చంపేట, జూలై 20 ప్రభాతవార్త:**నల్లమల అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న ఇందిరా మహిళ శక్తి సంబురాలు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా మంత్రులు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ, మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదలు హాజరుకానున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం నిర్వహించే సభ ప్రాంగణాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తన అనుచరులతో కలిసి ఆదివారం పరిశీలించారు. మహిళ సాధికారత సంబురాల కార్యక్రమాని విజయవంతం చేసేందుకు నల్లమల ప్రాంతంలోని మహిళా మణులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు.

## నారాయణపేటలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**నారాయణ పేట, జూలై 20 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఏక్లాస్ పూర్, యద్గిరి ప్రధాన రహదారి, రోడ్డు వద్ద ఏఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి, వాహనాలపై ఉన్న పాత బకాయిలు చెల్లించాలని, వాహనాలకు సరైన పత్రాలు లేని వారికి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించి, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని తెలిపారు. ఒక నిమిషం ఆలస్యం ఒక జీవితం రక్షణ, నిబంధనలు పాటించండి ప్రాణాలను కాపాడుకోండి అనే నానుడితో వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు క్రింది రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రిబుల్ రైడింగ్‌లో వాహనాలు నడపరాదని తెలిపారు. రాష్ డ్రైవింగ్ చేయరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, ప్రతి ఒక్కరూ వాహనాలకు ఇన్సూరెన్స్, నెంబర్ ప్లేట్, ఆర్‌సి కలిగి ఉండాలని, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పలు సూచనలు చేశారు.

## కాల గమనం పుస్తకావిష్కరణ

**తెలంగాణ ప్రముఖ కవి నాలేశ్వరం శంకరం**



**ఉప్పునుంతల, జూలై 20 ప్రభాతవార్త :** సామాజిక సమస్యలను ప్రధాన అంశంగా తన కవితలలో ప్రస్తుటించిన ఎం.ఏ గఫార్ సామాజిక కవితగా గుర్తింపబడతారని తెలంగాణ ప్రముఖ కవి వక్త ఉపన్యాసకులు సాహితీ విత్తలు నాగేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో కాల గమనం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి ఎంఏ గఫర్ కలము నుంచి జాలు వారిన కాలగమనం పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృభాష ఉర్దూ అయినప్పటికీ తెలుగులో కవిగా రాణించడం గొప్ప విషయం అన్నారు. తెలుగు భాషపై ఉన్న మక్కువతో నల్లమల్ల రత్నాలు ప్రజాప్రస్థానం మేలుకొలుపు తదితర రచనలు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మకట శతకంలో వచన కవిత్వాన్ని రచించడం చాలా అరుదుగా ఉంటారని అలాంటి వారిలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో అబ్దుల్ గఫార్ ముందు వరుసలో ఉంటారని ఆయన వెల్లడించారు. కుటుంబ నేపథ్యం ఉద్యోగ జీవితా అనుభవం అతని రచనల్లో కళ్లకు కట్టినట్లుగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కవులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. స్థానిక భాషాభిమాని సీనియర్ డాక్టర్ బంధం బాల నారాయణ కవి సమ్మేళనంలో పాల్గొని కవులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో పెద్ద సంఖ్యలో కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు వల్లభాపురం జనార్ధన్, కర్నాటి రఘురాములు గౌడ్, ముచ్చర్ల దినకర్, వనపట్ల సుబ్బయ్య, సాయి, జ్యోతి, కాటమరాజు, నరసింహులు, ఎదుంవల్లి కాశన్న, ఖాజా మైనుద్దీన్, కందికొండ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ ఇన్‌చార్జిగా వంశీచంద్‌రెడ్డి

**- శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్, జూలై20, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియకు కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. ఈమేరకు డీసీసీ అధ్యక్షులు ప్రక్రియ నియామక ప్రక్రియ ఏఐసీసీ ఇన్‌చార్జిగా చల్లా వంశీచంద్ రెడ్డి నియమితులుయ్యారు. ఈమేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంశీచంద్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

## అమ్మవారు చల్లంగా చూడాలి

**- శ్రీశ్రీశ్రీ బుర్జు గడ్డ బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్**

**మహబూబ్‌నగర్, జూలై20, ప్రభాతవార్త :** అమ్మవారు ప్రజలను చల్లంగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ వేడుకున్నారు. శ్రీశ్రీశ్రీ బుర్జు గడ్డ బంగారు మైసమ్మ బోనాల పండగ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల సాక్షిగా వేదమంత్రాలతో ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విఠల్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, దివ్య జ్యోతి, పిల్లి శ్రవణ్, ఆనంద్, రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, యాదయ్య, శివకుమార్ మరియు ఇతర పెద్దలు పాల్గొన్నారు.

## పీఎం దన్‌ధాన్య యోజనతో దేశవ్యాప్తంగా 1.75 కోట్ల మంది రైతులకు లబ్ది

**బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లే నర్సప్ప**

**కృష్ణ, జూలై 20 ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్రమోడీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో నూతన పథకం పీఎం దన్ ధాన్య యోజన తీసుకురావడం హర్షించదగ్గ విషయమని బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప అన్నారు. ఈ పథకం ద్వారా దేశంలోని 100 జిల్లాలను ఎంపిక చేయగా అందులో తెలంగాణలో 3 జిల్లాలను ఎంపిక చేయగా దాంట్లో ఉమ్మడి మహబూబ్ నగర్ ఉండడం, శుభ పరిణామం అని అన్నారు. దేశ వ్యాప్తంగా 2021,22 సంవత్సరాల్లో నిర్వహించిన సర్వే ఆధారంగా వర్షాపాతం అధికంగా ఉన్న జిల్లాలను దేశంలో 12 రాష్ట్ర లు తెలంగాణలో మూడు వెనుక బడిన జిల్లాలకు ప్రయోజనాలు చేకూరే విధంగా కరువు నివారణ నిమిత్తం 15వ ఆర్థిక సంగం సూచన మేరకు జాతీయ విపత్తు నిర్వహణ ప్రత్యేక నిధుల ద్వారా 100కోట్లు మంజూరు చేసి రైతులకు చేదోడు వాదోడుగా అండగా ఉన్నారన్నారు. మూడోసారి దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ప్రధాన ఆలోచనతో గ్రామీణ రైతు కుటుంబల ఆదాయ భద్రతను దృష్టిలో ఉంచికొని తీసుకు వచ్చిందే ఈ పీఎం దన్ ధాన్య యోజన ఉద్దేశం అని అన్నారు. అదేవిదంగా ఈ పథకం కింద రైతులకు సబ్సిడీ కింద వ్యవసాయ పనిముట్లు ఇవ్వడం జరుగుతుంది అని ఆయన తెలిపారు. అలాగే 50 శాతం సబ్సిడీతో ఎరువులు అందించడం, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ప్రతి 4 నెలలకు ఒక సారి రైతుల ఖాతాల్లో డబ్బులు వేయడం, రైతులు ప్రకృతి వైపరిత్యం ద్వారా పంటలు నష్టపోతే ఇన్సూరెన్స్ ఇవ్వడం చూస్తుంటే రైతుల పట్ల మరియు దేశ వ్యవసాయం బలోపేతం పట్ల ప్రధాని నరేంద్ర మోడీకి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందన్నారు.

## రోడ్లపై మురుగునీరు

**మురుగునీటితో బురదగా మారిన కాలనీ రోడ్డు**

**చిన్న చింతకుంట, జూలై 20 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉంద్యాల గ్రామంలోని ప్రధాన వీధుల రోడ్లపై మురుగనీరు ప్రవహిస్తుండడంతో కాలనీవాసులు అంటు రోగాల బారిన పడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అస్తవ్యస్తమైన కాలనీ రోడ్లు సిసి రోడ్లకు నోచుకోక రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు మురుగునీరు రోడ్డు మీదికి వదలడంతో మురుగు వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో రోజులుగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన డ్రైనేజీ నిర్మాణంపై చొరవ చూపక పోవడంతో ఇప్పటికీ అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటేనే వర్షపు నీటితో గుంతల్లో బురద పేరుకుపోయి వాహనాలు వెళ్లాయంటే రోడ్డుకి ఇరువైపులా బురద రావడంతో నడవలేక ఇబ్బందులు పడుతున్నామని వార్డు ప్రజలు దీనంగా తెలుపుతున్నారు. గ్రామంలోని ఆయా కాలనీలో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టిన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగనీరు రోడ్లపైకి వస్తున్నాయని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్ కాలనీలోని ప్రధాన రహదారులను సిసి రోడ్లుగా మార్చి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- మహిళల అభ్యున్నతి లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుంది...
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మహిళా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఘనంగా మహిళా శక్తి సంబరాలు, బోనమెత్తిన మహిళలు



మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్



ఇండ్ల ప్రొసిడింగ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**కల్వకుర్తి, జూలై 20 ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని సికెఆర్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబురాలకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏ పథకం మొదలుపెట్టినా ముందు మహిళలకే ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500లకే వంట గ్యాస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు కూడా మహిళల పేరు మీదనే ఇస్తున్నామన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలను ఆర్థిక బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. కరెంటు ఉత్పత్తి చేసేందుకు కూడా సోలార్ పవర్ ప్లాంట్లు ఇచ్చిందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనేదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ..... ఇందిరా మహిళా శక్తి సంబురాలు నేడు పండుగ వాతావరణంలో జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాగర్‌కర్నూలు జిల్లాలో 5 వేల మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి ద్వారా బ్యాంకులో రుణాలు పొంది, వివిధ రకాల వ్యాపారాల్లో రాణిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. మహిళా సంఘాలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించడం ద్వారా విద్యార్థులకు సరైన కొలతలతో యూనిఫామ్ విద్యార్థులు ధరించడం మహిళల పనులకు నిదర్శనమని కలెక్టర్ ఈ సందర్భంగా కొనియాడారు. నాగర్‌కర్నూలు జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 77 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా 80 వేల మంది రైతులతో 33 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి కోటి రూపాయల కమిషన్‌ను మహిళా సంఘాలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లాలో మహిళా సంఘాలతో సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా నాలుగు ప్రదేశాల్లో మహిళా సంఘాలకు పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయడంతో నెలకు 5 లక్షల వరకు లాభాలను పొందే విధంగా ప్రభుత్వం మహిళలకు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఆర్టీసీ బస్సులకు కూడా మహిళలే యజమానులు కాబోతున్నారని కలెక్టర్ తెలిపారు. ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేని ఇందిరమ్మ లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా లోన్లు ఇప్పిస్తున్నామని పేర్కొన్నారు. మరింత మంది మహిళలను స్వయం సహాయక సంఘాల్లో నమోదు చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గం లో 2500 రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు, 5800 మంది పేర్లను రేషన్ కార్డుల్లో నమోదు చేయడం జరిగిందని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని 57 స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకులింకేజీ ద్వారా 5.47 కోట్ల రూపాయల చెక్కును, 1387 మంది స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు 1.57 కోట్ల రూపాయల చెక్కును, 14 మంది సభ్యుల 6.88 లక్షల రూపాయల లోన్ బీమా చెక్కులను, కల్వకుర్తి నియోజకవర్గానికి మంజూరైన నూతన రేషన్ కార్డులను, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు మహిళ స్వయం సహాయక సభ్యులకు అందజేశారు. అంతకుముందు మహిళా సంఘాల పలువురు మహిళలు తాము సాధించిన ఆర్థిక ప్రగతి, వ్యాపార అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పిడి రాజేశ్వరి, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, కల్వకుర్తి నియోజకవర్గం మండలాల తహసిల్దార్లు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు, అత్యధిక సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్

- వికలాంగులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలి
- ఆగస్టు13న చలో హైదరాబాద్
- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై20, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి పదవి భోగం అనుభవిస్తున్నాడే తప్ప పెన్షన్ దారుల కష్టాల గురించి పట్టించుకోవడం లేదని, పెన్షన్ లు పెంచకపోతే లక్షలాది మంది వికలాంగులు, చేయుతపెన్షన్ దారులు కాంగ్రెస్ కు దూరం అవుతారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. వికలాంగుల, చేయూత పెన్షన్ మరియు ఇతర పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ సన్నాహక మహబూబ్‌నగర్‌లో జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు అధ్యక్షత జిల్లాసదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 13న చలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో వికలాంగుల, చేయూత పెన్షన్ దార్ల మహాగర్జన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల పెన్షన్లు రూ.6000కు పెంచాలని, అలాగే చేయూత అన్ని రకాల పెన్షన్లు రూ.4000 పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు హామీల మీద హామీలు ఇచ్చి తీరా అధికారంలో రాగానే వాటిని నెరవేర్చకుండా మోసం చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి వికలాంగులకు రూ.6000 అలాగే మిగితా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత,గీత, బీడీ కార్మికుల, పెన్షన్ రూ.4000 పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి దానిని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. పెన్షన్ దారుల పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ...ప్రతిపక్ష పార్టీ నేత కేసీఆర్ వికలాంగుల పెన్షన్, కార్మికులు, చేనేత కార్మికుల సమస్యలు గాలికి వదిలేసి మాట్లాడకుండా మౌనంగా ఉన్నారని విమర్శించారు. వికలాంగులకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి,వికలాంగులకు 2016చట్టం అమలు చేయాలి, వికలాంగుల సంక్షేమ శాఖ స్వతంత్ర స్వయం పత్రిపత్తి శాఖ ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలి, ఉచిత బస్సు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయి కండరాల క్షీణత కలిగిన వారికి రూ.15000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 13 న నిర్వహించబోయే ఛలో హైదరాబాద్ కు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్,మైలారం శ్రీరాములు, మాదిమారేపల్లి రామచందర్, మాదిమిద్దె నాగరాజు, మాద్దిబొర్ర భిక్షపతి, జాతీయ అధికార ప్రతినిధి జిల్లా ఇంచార్జీ పడిగాళ్ళ సురేష్ మాదిగ పాల్గొన్నారు.

### అడవి తల్లి మధుర అనుభవం

# నల్లమలలో అద్భుతమైన ప్రకృతి యాత్ర



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న సభ్యులు

**అచ్చంపేట, జూలై 20 ప్రభాతవార్త:** అడవి అమ్మవంటిదని, ప్రకృతితో మమేకం కావడం వల్ల అద్భుతమైన రోగ నిరోధక ప్రయోజనాలు లభిస్తాయని అచ్చంపేట వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ చందు నాయక్, డిప్యూటీ తహసిల్దార్, ప్రధాన కార్యదర్శి రమేష్‌లు అన్నారు. అచ్చంపేట వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్‌లో భాగంగా అడవిలో మన్ననూర్ నుండి ఉమామహేశ్వరానికి నిర్వహించిన ట్రెక్కింగ్ ను ఫారెస్ట్ ఎడ్యుకేషన్ పబ్లిక్, టూరిజం అధికారి శ్వేత ప్రారంభించారు. ట్రెక్కింగ్ వెళ్లే క్రమంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అనంతరం చందునాయక్, రమేష్‌లు మాట్లాడుతూ అడవితో మమేకమై నడవడం ఒక ఆధ్యాత్మిక ప్రకృతి ప్రయాణంగా నిలిచిందని, మార్గమధ్యంలో పులి, చిరుతపులి అడుగులు, దారి వెంట అనేక పక్షులు కనిపించాయని అన్నారు. నడిచే క్రమంలో ప్రతి అడుగులో కొత్త ఉత్సాహం లభించిందని, ఇలాంటి నేచర్ యాత్రలు ప్రతి ఒక్కరిలో ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందిస్తాయని అన్నారు. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగిన ఈ ట్రెక్కింగ్ యాత్ర జీవితంలో మరిచిపోలేని ఘట్టంగా నిలిచిందన్నారు. ప్రకృతిని ప్రేమించాలి, కాపాడాలి అనే స్పష్టమైన సందేశాన్ని ఈ యాత్ర తీసుకువచ్చిందని అన్నారు. రేంజర్ సుబ్బు, బీట్ ఆఫీసర్ ఆశ, చెంచు యువకులు ప్రశాంత్, ప్రభాస్, పరశురాం, ఆంజనేయులు గైడ్‌గా పనిచేస్తూ పులుల అడుగులు, వన్య ప్రాణుల జీవనశైలి, వృక్షసంపద, మొదలైన అంశాలపై అవగాహన కలిగించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యం కోసం వాకింగ్, యోగ, ధ్యానంపై దృష్టి సారించాలని కోరారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడంతోపాటు అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునందన్, హెచ్‌ఎం బిచ్చనాయక్, రిటైర్డ్ జిహెచ్‌ఎం నర్సోజి, రిటైర్డ్ జిల్లామలేరియా అధికారి అశోక్ ప్రసాద్, నిరంజన్, రాములు, భాస్కర్, ఖదీర్, ఖాదర్, జమీర్, కాశీలింగం, ప్రమోద్, లక్ష్మికాంత్, సాయిరాం, హరికృష్ణ, రమేష్, స్వామి, మాధవాచారి, పుల్లయ్య, నరసింహ, శివశంకర్, హరి, శ్రీకాంత్, లక్ష్మణ్, హన్మ, ఖదీర్, ప్రకాష్, మల్లేష్, సాధిక్, సత్యం, క్రాంతి, తదిత రులు పాల్గొన్నారు.

## గురువులు నేర్పిన పాటలే శిష్యుల భవిష్యత్తుకు బాట



1985 .86 పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫోటో

**వీపనగండ్ల, జులై 20, ప్రభాతవార్త;**గురువులు నేర్పిన పాఠ్యాంశాలే శిష్యుల భవిష్యత్తుకు బాట పునాది వేస్తుంది అని విద్యార్థుల పూర్వ సమ్మేళనంలో గురువులు మాట్లాడుతూ అన్నారు. ఆదివారం నాడు వీపనగండ్ల ఏ.డే.డు పాఠశాల 1985.86 పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు మరియు ఆ సంవత్సరం చదువుకున్న పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. 40 సంవత్సరాల గోల్డ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్న పూర్వ విద్యార్థిని విద్యార్థులు ఒకరికొకరు పదవ తరగతిలో చదువు నేర్పిన గురువుల అభిప్రాయాలను వారు నేర్చుకున్న విద్యాబుధులను నెమరు వేసుకున్నారు. విద్యార్థి భవిష్యత్తులో తాను సొంతంగా బ్రతకగలిగే విద్యను అందించినప్పుడే గురువు రాణించగలుగుతాడని అలాంటి విద్యను బోధించినందువల్లే అప్పటి పాఠశాలల్లో ఉన్న 39 మంది విద్యార్థులను ఈరోజు వివిధ హోదాలలో ఉంటూ తమ కుటుంబాలను పోషించుకోవడం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. గురువు అనే పదము ఏదైతే ఉందో దానికి సార్ధకత ఉండాలి అంటే శిష్యులు వారు బోధించినటువంటి విద్యను అందించడమే కాకుండా వాళ్లు బతకాలి స్థితిని నేర్పినటువంటి వ్యక్తి గురువు అనే అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం మొదట గురువులకు స్వాగతం పలుకుతూ ముగింపులో కేక్ కట్ చేసుకొని వారి వారి అభిప్రాయాలను వెలిగించుకొని సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఈ సమావేశం ముగింపు చేశారు. ఇందులో పాల్గొన్న గురువులు కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి ,నారాయణ, ఖాజా మొయినుద్దీన్, సుగుణ రెడ్డి, బిచ్చయ్య గౌడ్ తో పాటు పూర్వ విద్యార్థులు నల్లపుతుల బాలస్వామి, శి మోలాలి, బీరయ్య, నాగరాజు, వెంకటేశ్వర శెట్టి, జగదీశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల వీవోఏల నూతన కార్యవర్గం ఏకగ్రీవం



మండల విఓఏల నూతన కార్యవర్గాన్ని సన్మానించిన దృశ్యం

**కృష్ణ,జూలై 20 ప్రభాతవార్త :** ఆదివారం మండల కేంద్రంలోని క్షీరలింగేశ్వర ఆలయ ప్రాగణంలో మండల వివోఏల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా లక్ష్మిబాయి, గౌరవాధ్యక్షులుగా మహేందర్, కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షులుగా శంకరమ్మ, సహాయ కార్యదర్శిగా మహదేవ్, కోశాధికారిగా కృష్ణ, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు లక్ష్మిబాయి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్తూ గత 20 సంవత్సరాలుగా మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న వివోఏలకు కనీస వేతనములు అమలు చేయకుండా ప్రభుత్వం చిన్న చూపు చూడడం సరికాదని ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివోఏలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని అలాగే ఉద్యోగ భద్రత కల్పించి నూ.10 లక్షల ఇన్సూరెన్స్ వర్తింప చేయాలని అన్నారు. తలకు మించిన ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏలు కుమారి, పద్మమ్మ, లింగప్ప, తాహెర్, లక్ష్మి, క్షీరమ్మ, సాబమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**- ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్**

మహబూబ్‌నగర్ జూలై20, ప్రభాతవార్తః మహబూబ్‌ననగర్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని శ్రీశ్రీశ్రీ బుర్జు గడ్డ బంగారు మైసమ్మ బోనాల పండుగ సందర్భంగా పంచముఖ ఆలయంలోని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ వాసుల తో కలిసి ముడా నిధులతో నూతన హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విఠల్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ ఆనంద్, సెక్రటరీ అంజి గౌడ్,గిరి, దివ్య జ్యోతి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## పీయూ చీఫ్ వార్డెన్‌గా డా మన్నేమోని కృష్ణయ్య

**మహబూబ్‌నగర్, జూలై20, ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ తెలుగు విభాగానికి చెందిన డా మన్నేమోని కృష్ణయ్యను క్యాంపస్ లో ని అన్ని హాస్టల్స్‌కు చీఫ్ వార్డెన్‌గా నియమిస్తూ ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈమేరకు శనివారం రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు,విద్యా సంచాలకులు డా చంద్రకిరణ్ వీసీతో కలిసి ఉత్తర్వులు అందజేశారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**కృష్ణ, జూలై 20 ప్రభాతవార్త :** గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎంఎస్ నవీద్ తెలిపిన వివరాల ప్రకారం హిందూపూర్ గ్రామము జాతీయ రహదారి 150 పై ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గం.ల సమయంలో గురజాల గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తి హైదరాబాదు నుంచి గ్రామానికి వస్తుండగా హిందూపూర్ గ్రామం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన దేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కొరకు మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీద్ తెలిపారు.

## ఫాంపాండ్‌లో పడి వ్యక్తి మృతి ?

**జడ్చర్ల,జూలై20, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు వ్యవసాయ నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నేల బండ తండాలో చోటుచేసుకుంది. నేలబండ తండా కు చెందిన రవి నాయక్ (40) మూడు రోజుల క్రితం పక్కనే ఉన్న వాయిల గడ్డ తండా లో ఉన్న తన అక్కను కలిసి ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలోనే రవి నాయక్ కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు.ఆదివారం తండా వద్ద వ్యవసాయ పొలంలో ఏర్పాటుచేసిన ఫాంపాండ్‌లో రవినాయక్ మృతదేహం తేలియాడుతూ కనిపించింది.విషయాన్ని గమనించిన చుట్టుపక్కలవారు కు టుంబసభ్యులకు,పోలీసులకు సమాచారమందించడంతో ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.రవినాయక్ ప్రమాదవశాత్తు నీటిసంపులో పడ్డాడా లేక ఇతరకారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. కాగా మృతుడికి ఒక చేయి లేకపోవడంతో నీటి గుంటలో పడ్డాక పైకి లేవలేక మృతి చెంది ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. మృతుడికి భార్య అంజమ్మ తో పాటు ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన జడ్చర్ల పోలీసులు దర్యాప్తు చేపట్టారు.